జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 14-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 783 పేజీలు: 4 వెల : రూ.7

# నేడు వినాయక చవితి



పాఠకులకు, ప్రకటనకర్తలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు

**వినాయక చవితి శుభాకాంక్షలు**

- ఎడిటర్, జాతీయ వార్త

**☀ వాడవాడలా సిద్ధమైన మండపాలు ☀ గణనాథుని ఆలయాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు ☀ లంబోధరుని విగ్రహాల కొనుగోలుకు బారులు దీరిన యువత ☀ పండ్లు, పత్రి, పూలు కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్ ☀ జిల్లావ్యాప్తంగా ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ**

శ్రీకాకుళం, సెప్టెంబర్ 13 (వార్త): గణపతి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానుంది. భారతదేశంలో హిందువులు చేసుకునే ప్రధాన పండుగల్లో వినాయక చవితి ప్రధానమైంది. వినాయక ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గణపతి మండపాలను సిద్ధం చేశారు. లంబోధరుని విగ్రహాల కొనుగోలుకు యువత ఆదివారం శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, తదితర ప్రాంతాలకు తరలివచ్చారు. మట్టి వినాయక ప్రతిమలను స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను పూజకు వాడవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించినప్పటికీ కొందరు ఆ విగ్రహాలనే పూజకు కొనుగోలు చేయడం కనిపించింది. అయితే గతంలో కన్నా ప్రస్తుతం మట్టి వినాయక ప్రతిమలను ప్రజలు కొనుగోలు చేయడం అభినందనీయం. పూలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. పత్రిని కూడా మార్కెట్లలో అమ్మేశారు. శ్రీకాకుళం నగరంలోని పాతబస్టాండ్‌లోని పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతుబజార్ తదితర ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జాం అయింది. లడ్డూను గణనాథునికి ప్రసాదంగా ఇచ్చేందుకు ప్రజలు స్వీట్ షాపులకు బారులు దీరారు. వివిధ సైజుల్లో లడ్డూలను స్వీట్ షాపుల యజమానులు విక్రయించారు. గణపతి మండపాలను ఈసారి ధగధగలాడాయి. ప్రభుత్వం మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్టు ప్రకటించడంతో ఈసారి నిర్వాహకులు భారీ సెట్లు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. గణపతి మండపాలు ఏర్పాటుకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని చెప్పినప్పటికీ కొందరు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే మండపాలు ఏర్పాటు చేశారు. వినాయక ప్రతిమలు నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

**జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు:మంత్రి అచ్చెన్న**

వినాయక చవితి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని పిలుపునిచ్చారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖ శాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో ఎదురయ్యే అన్ని విఘ్నాలు తొలగిపోవాలన్నారు. వినాయక చవితి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణానికి హాని కలగకుండా వేడుకలను నిర్వహించాలని కోరారు.

**ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు: కేంద్ర మంత్రి రామ్మోహన్**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గణపయ్య ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు చేకూరాలని కోరారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పర్యావరణ హితమైన వస్తువులతో పండుగను నిర్వహించాలని సూచించారు. వినాయక చవితి వేడుకల్లో అనవసర ఆర్భాటాలకు, అధిక శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలని కోరారు. డీజే సౌండ్లకు బదులుగా భక్తిభావంతో, ప్రశాంతమైన వాతావరణంలో గణనాథుడిని పూజించుకోవాలన్నారు.

**అందరికీ శుభం కలగాలి: ఎస్పీ**

జిల్లా ప్రజలకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వినాయక చవితి శుభకాంక్షలు తెలియజేశారు. గణనాథుడి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలన్నారు. జిల్లా ప్రజల జీవితాల్లో సకల శుభాలు కలగాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, అభివృద్ధితో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీసు శాఖ జారీ చేసిన భద్రతా సూచనలు, నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అలాగే నిమజ్జన కార్యక్రమాలను కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ సూచనల మేరకు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ మరోసారి ప్రజలను కోరారు.




# కిడ్నీ పరిశోధన కేంద్రంలో.. వైద్యుల పోస్టులు.. ఖాళీ

**☀ ఉద్దానం కిడ్నీ సమస్యపై తక్షణ చర్యలు చేపట్టాలి**
**☀ డయాలసిస్ కేంద్రాలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి**
**☀ అంతర్జాతీయ నిపుణులతో సమగ్ర పరిశోధన చేపట్టాలి**
**☀ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ డిమాండ్**
**☀ సమగ్ర వివరాలతో ప్రభుత్వానికి లేఖ**

పలాస, సెప్టెంబర్13 (వార్త): శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత కిడ్నీ బాధితులకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు శ్రీకాకుళం జిల్లా పలాసలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్యాజువాలిటీ, రేడియో డయాగ్నోసిస్, హాస్పిటల్ స్టోర్స్, సెంట్రల్ ల్యాబ్స్, నెఫ్రాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ, డయాలసిస్, నెఫ్రాలజీ వార్డులు, ఓటీ కాంప్లెక్స్, పోస్ట్ ఆపరేటివ్/ఐసీయూ, యూరాలజీ వార్డ్స్, రీసెర్చ్ ల్యాబ్స్‌లు ఉన్నాయి. ఎంఆర్ఐ, సీటీ స్కాన్, 2డీ ఎకో, హై ఎండ్ కలర్ డాప్లర్, మొబైల్ ఎక్సరే (డిజిటల్), ఏబీజీ అనలైజర్ పరికరాలతో పాటు పూర్తిగా రిమోట్ కంట్రోల్ ఐసీయూ సౌకర్యాలను కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో అందుబాటులోకి తెచ్చింది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, వంటి వివిధ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య పోస్టులు 46, స్టాఫ్ నర్సు పోస్టులు 60, ఇతర సహాయ సిబ్బంది పోస్టులు 60 చొప్పున మంజూరు చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించలేదు. వైద్యులు 20 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 18 టెక్నీషియన్ పోస్టులకు కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని, వారిలో కొందరు కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేక నెఫ్రాలజిస్టు సేవలు నిరంతరం అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో పలు పోస్టుల నియామకాలకు ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇస్తున్నా ఎవరూ ముందుకురావడం లేదు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది కూడా డెప్యుటేషన్‌పై వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు తప్ప ఇక్కడ సేవలు అందించేందుకు ముందుకురావడం లేదు. ఇటీవల ఉద్దానం కిడ్నీ సమస్యపై నిపుణుల కమిటీ సమర్పించిన మధ్యంతర నివేదికలోని గణాంకాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజ శర్మ వెల్లడించారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టిసారించి, శాశ్వత పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం లేఖ రాశారు. ఇటీవల 3,897 మందికి నిర్వహించిన పరీక్షల్లో 949 మందికి కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించడం.. 24.35 శాతం నమోదవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందన్నారు. గతంలో 2017-19 మధ్య ఉద్దానం పరిధిలోని 176 గ్రామాల్లో 1,01,593 మందికి స్క్రీనింగ్ నిర్వహించగా 13,093 మందిలో.. అంటే 12.88 శాతం మందిలో కిడ్నీ సంబంధిత సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. ఈ రెండు దశల గణాంకాలను పరిశీలిస్తే వ్యాధి తీవ్రతపై మరింత లోతైన, శాస్త్రీయ అధ్యయనం అవసరమని అజ శర్మ అన్నారు. పలాసలో నిర్మించిన ఉద్దానం కిడ్నీ వ్యాధి పరిశోధన కేంద్రాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఉద్దానం కిడ్నీ వ్యాధికి అసలు కారణాలను శాస్త్రీయంగా నిర్ధారించేందుకు అంతర్జాతీయ నిపుణుల సహకారంతో సమగ్ర పరిశోధన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన కేంద్రాన్ని అధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేయడంతో పాటు డయాలసిస్ యూనిట్ల సంఖ్యను పెంచాలని కోరారు. డయాలసిస్ కేంద్రాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని, మండలానికో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి కిడ్నీ రోగులకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో నెఫ్రాలజిస్టులు, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రతి పంచాయతీ పరిధిలో ప్రాథమిక వైద్య సేవలు అందించే డిస్పెన్సరీలను ఏర్పాటు చేయాలని అజ శర్మ సూచించారు. మందస పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంచడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించే సదుపాయాలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. కిడ్నీ వ్యాధి నివారణకు విస్తృతంగా ఉచిత స్క్రీనింగ్ నిర్వహించాలని, వ్యాధిగ్రస్తులకు అవసరమైన ఉచిత మందులతో పాటు నెలవారీ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన జీవోలను పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా ఉద్దానం కిడ్నీ సమస్యను నియంత్రించేందుకు మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చన్నారు.


Forum for Development of North Andhra ( FDNA)
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక
(రి.నెం. 276/2015)
B-25, Jeevan Soudha Apartments,
HB Colony,
Visakhapatnam-530022
Email: fdnasvv3@gmail.com,
fb: uttarandhra abhivrudhi vedeka

Chairman : Prof. KV Ramana
Former Vice- Chancellor, AU

General Secretary : A Aja Sarma

13.09.2026

గౌరవ ముఖ్యమంత్రి గారికి,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.
అర్యా,

విషయం: ఉద్దానం కిడ్నీ వ్యాధి తీవ్రత గురించి, పరిష్కారానికై........

[illegible]

ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# చిన్న వర్షానికే.. నరసన్నపేట.. జలమయం

**డ్రైనేజీ నిర్వహణపై స్థానికుల ఆందోళన ☀ కాలువల ఆక్రమణలు తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్**

**నరసన్నపేట, సెప్టెంబర్ 13 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో ఆదివారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు 32 మి.మీ. వర్షపాతం నమోదైన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గాంధీనగర్-2లో బురద నీరు చేరడంతో కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనూ రహదారులపై నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గాంధీనగర్-2లో వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృత మవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పట్టణంలో ఉన్న సహజ కాలువలు, డ్రైనేజీ మార్గాలను సక్రమంగా నిర్వహించకపోవడం, పలు ప్రాంతాల్లో కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, డ్రైనేజీల్లో పూడిక తొలగింపు పనులు సకాలంలో చేపట్టకపోవడం వల్ల వర్షపు నీరు సాఫీగా వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అరగంట పాటు కురిసిన వర్షానికే రోడ్లు జలమయ మవుతున్న పరిస్థితి ఉంటే భారీ వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు, డ్రైనేజీ మార్గాలపై ఆక్రమణలు ఉన్నప్పటికీ వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన నీటి ప్రవాహ మార్గాలు క్రమంగా కుచించుకుపోతే వర్షపు నీరు ఎక్కడికి వెళ్లాలని వారు నిలదీస్తున్నారు. ఆక్రమణలకు అనుమతులు ఎలా వచ్చాయి, వాటిని గుర్తించి ఎందుకు తొలగించడం లేదనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. వర్షం పడిన ప్రతిసారీ తాత్కాలికంగా నీటిని తొలగించడం కాకుండా పట్టణంలోని మొత్తం డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాలువల అసలు వెడల్పు, నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి వాటిని పరిరక్షించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నారు. నరసన్నపేట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించాలని సామాజికవేత్త, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు యాల మల్లేశ్వరరావు కోరారు. పట్టణంలోని ప్రధాన కాలువలు, డ్రైనేజీలను ప్రత్యేకంగా పరిశీలించి పూడికలు తొలగించాలని, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను గుర్తించి చట్టపరంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం కావడాన్ని సాధారణ సమస్యగా చూడకుండా, భవిష్యత్తులో భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలకు ముందస్తు హెచ్చరికగా పరిగణించాలని ఆయన అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సమగ్ర డ్రైనేజీ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని గాంధీనగర్-2తో పాటు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.







## పాము కాటుకు రైతు మృతి



**నరసన్నపేట, సెప్టెంబర్ 13 (వార్త):** నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన రైతు లుకలాపు గోవిందరావు పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. శనివారం ఉదయం వ్యవసాయ పనుల్లో ఉన్న సమయంలో ఆయనను పాము కాటేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాము కాటుకు గురైన వెంటనే బంధువులు గోవిందరావును నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గోవిందరావు మృతితో నడగాం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై బి. గణేశ్ తెలిపారు.

## నేడు పీజీఆర్ఎస్ రద్దు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 13 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) సోమవారం రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. వినాయక చవితి ప్రభుత్వ సెలవు దినము కావడంతో రద్దు చేశామని, ప్రజలు వ్యయ ప్రయాసలు కోర్చి రావొద్దన్నారు. మీ కోసం వెబ్ సైట్ డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చున్నారు. అలాగే పి.జి.ఆర్.ఎస్‌కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100ను వినియోగించుకొని, అర్జీల పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసుకోవచ్చున్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో సోమ వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమం వినాయక చవితి సందర్భంగా రద్దు చేస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. అర్జీ దారులు ఈ విషయాన్ని గమనించి, సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకు గురై జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వినతులు, సమస్యలు తెలియజేసేందుకు రావద్దన్నారు.

## బెహరా అమ్మడు కుటుంబానికి సాయం



**శ్రీకాకుళం, సెప్టెంబర్13 (వార్త):** పాలకొండకు చెందిన బెహరా అమ్మడు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.30,500 ఆర్థిక సహాయం చెక్కును ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అందజేశారు. శ్రీకాకుళంలోని శాంతినగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో అమ్మడు కుటుంబానికి ఈ చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన వారికి వైద్య, ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్నా మన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం తరపున అందుతున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఆదిత్యుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

**అరసవల్లి, సెప్టెంబర్13 (వార్త):** ఆరోగ్యప్రదాత సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. టికెట్లు రూపేనా రూ.63,100, పూజలు, విరాళాల రూపంలో రూ.52,270, ప్రసాదాల రూపం లో రూ.85080, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ.86,569 ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.

## గంగారావు కుటుంబానికి వెంకన్న చౌదరి పరామర్శ



**పలాస, సెప్టెంబర్13(వార్త):** టెక్కలిపట్నం పంచాయతీ పరిధిలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన దశరథ తండ్రి అవుగాన గంగారావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలాస తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆదివారం గంగారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గంగారావు మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన వెంకన్న చౌదరి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంగారావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. విషాద సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లా శ్రీనివాస్, పీరికట్ల విఠల్, తమ్మినేని గంగారాం, మురిపింటి కుమారాజా, పోలాకి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## నాగబాబుకు ఘన సన్మానం

**పలాస, సెప్టెంబర్ 13 (వార్త):** ఏపీ గ్రీన్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబును పలాస మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు ఘనంగా సన్మానించారు. పలాస నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకు లతో కలిసి నాగబాబుకు దుశ్శాలువ కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అంద జేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టా ల్సిన చర్యలు, పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై నాయకులు చర్చించినట్లు తెలి పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలో పేతం చేయాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజక వర్గానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బిజెపి సోషల్ మీడియా కన్వీనర్‌గా కృష్ణారావు



**సోంపేట, సెప్టెంబర్ 13 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా తెంబూరు కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా బిజెపి అధ్యక్షుని నుంచి ఆదేశాలు వెలువడినట్లు కృష్ణారావు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి సోషల్ మీడియా వేదికగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బిజెపి బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు సీమ కుమార్‌రావుకు మంత్రి అభినందనలు

**సోంపేట, సెప్టెంబర్ 13 (వార్త):** గత ఏడాది ఉపాధ్యాయునిగా పదవి విరమణ చేసిన సోంపేటకు చెందిన సీమ కుమార్ రావు అనే ఉపాధ్యాయుడు తాను గతంలో పనిచేసిన కంచిలి మండలం డీజీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుర్చీలు కొనుగోలు నిమిత్తం పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు కుమార్ రావు సేవా నిరతిని గుర్తించి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంతకం చేసిన అభినందన పత్రాన్ని పాఠశాల యాజమాన్యం అందించింది. ఈ మేరకు కుమార్ రావు హర్షం వ్యక్తం చేశారు.

## దుర్గాదేవి శరన్నవరాత్రులకు పందిరిరాట



**పలాస, సెప్టెంబర్13 (వార్త):** దుర్గాదేవి శరన్నవరాత్రి పూజా మహోత్సవాలకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ కాలనీలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం పూజా మండపం నిర్మాణానికి పందిరిరాట వేశారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిం చేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌక ర్యం కలగకుండా మండపం, విద్యుత్ అలంకరణలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధ లతో, ఘనంగా నిర్వహించేందుకు కాలనీ వాసులు, ఉత్సవ నిర్వాహకులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. పందిరిరాట ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## మజ్జి తులసీదాస్‌కు ఘన నివాళి

**ఆమదాలవలస, సెప్టెంబర్13 (వార్త):** పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మజ్జి తులసీదాస్ 101వ జయంతి సందర్భంగా ఆమదాలవలస పట్టణంలో కాంగ్రెస్ నాయకులు నివాళు లర్పించారు. డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసీదాస్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సనపల అన్నాజీ రావు మాట్లాడుతూ మజ్జి తులసీదాస్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడని పేర్కొన్నారు. శ్రీకా కుళం జిల్లా సోంపేట మండలం పాత్రపురం గ్రామంలో జన్మించిన ఆయన అక్కడి నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని తెలిపారు. 1972లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సోంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. అనంతరం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి వెనుకబడిన తరగతుల వర్గానికి ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. 1992 నుంచి 1994 వరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. 1994లో ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తులసీదాస్ జిల్లా అభివృద్ధి, రైతాంగ సంక్షేమానికి అవసరమైన నిధులను తీసుకురావడంలో చురుకైన పాత్ర పోషించారని అన్నాజీరావు పేర్కొన్నారు. ఆయన రాజకీయ జీవితాన్ని, ప్రజాసేవను నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి గోవింద గోపాల్, బొచ్చ వెంకటరమణ, లఖినేని నారాయణరావు, బస్వా షణ్ముఖరావు, గొల్లపల్లి దాలయ్య, గుంట బారిక అప్పారావు, గురుగుబిల్లి కృష్ణమూర్తి, బొడ్డు రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తులసీదాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**ఇచ్ఛాపురం సెప్టెంబర్13 (వార్త):** ఆపదలో ఉన్న కుటుంబానికి కొండంత అండ... సీఎంఆర్ఎఫ్ అని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. బెల్లుపడ 12వ వార్డుకు చెందిన నీలాపు భరత్ ప్రమాదానికి గురై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న రాష్ట్ర బి.సి. రెడ్డిక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ విషయాన్ని ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ దృష్టికి తీసు కెళ్లగా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని బాధితునికి ప్రభుత్వం నుండి ముఖ్య మంత్రి సహాయ నిధి కింద లక్ష రూపాయలు మంజూరయ్యేలా చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పత్రి తవిటయ్య, ఆసి లీలారాణి, నందిగాం కోటి, కోరాయి ధర్మరాజు, కొండా సూరి, ఆసి ధర్మ రాజు, ఉప్పాడ వెంకటరమణ పాల్గొన్నారు.

## గురు బ్రహ్మ అవార్డుకి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపిక

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్13 (వార్త):** మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురుబ్రహ్మ స్టేట్ అవార్డ్స్ విన్నర్స్-2026 ప్రెస్ క్లబ్ డాబా గార్డెన్ విశాఖపట్నంలో అందజేశారు. ముఖ్యఅతిథి ఆంధ్ర యూని వర్సిటీ ప్రొఫెసర్ విజయ రత్నం, మదర్ థెరిసా ట్రెస్ట్ ఫౌండర్ కె.కృష్ణమూర్తిలు బెస్ట్ స్టేట్ టీచర్స్ అవార్డ్స్ అందజేశారు. డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయులు ఎంపిక అయ్యారు. వీరిలో సీహెచ్ వెంకటరమణ (హిందీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు), ఆసి పురుషోత్తం (ఉపాధ్యాయులు,తిప్పనపుట్టుగా), మిత్తన నిమ్మయ్య ఉన్నారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



# పలాస మున్సిపాలిటీలో.. జనసేన పాగా వేస్తుందా?

* కూటమి చైర్మన్ అభ్యర్థిగా కోత పూర్ణచంద్రరావు పేరు తెరపైకి * మాజీ చైర్మన్ అనుభవం.. వ్యక్తిగత పరిచయాలు కలిసొచ్చేనా? * 36వార్డుల్లో బలమైన అభ్యర్థుల ఎంపికే కూటమికి అసలు సవాల్ * ఓట్ల బదిలీ, అంతర్గత సమన్వయంపైనే విజయావకాశాలు



పలాస, సెప్టెంబర్13 (వార్త): పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల రాజకీయం క్రమంగా వేడెక్కుతోంది. చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు వ్యూహాలకు పదును పెడుతున్న నేపథ్యంలో.. కూటమి తరపున జనసేన నుంచి మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు పేరు తెరపైకి రావడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కోత పూర్ణచంద్రరావుకు గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. పట్టణంలోని వివిధ వర్గాలతో ఉన్న వ్యక్తిగత పరిచయాలు, రాజకీయ సంబంధాలు ఆయనకు అనుకూల అంశాలుగా మారే అవకాశం ఉందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. తన హయాంలో సుమారు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని ఆయన వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో గత పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఏ మేరకు గుర్తిస్తారు? ఆ పనులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం ఏమిటి? గతంలో ఏర్పడిన వ్యక్తిగత పరిచయాలు ఓట్లుగా మారతాయా? అన్నది కీలకంగా మారనుంది. మున్సిపల్ ఎన్నికల్లో వ్యక్తిగత పరిచయాలతో పాటు పార్టీ గుర్తు, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, వార్డు స్థాయి అభ్యర్థుల బలం వంటి అంశాలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

## మహిళా అభ్యర్థి అంశం కూడా తెరపైకి..

చైర్మన్ అభ్యర్థిత్వంలో మహిళకు అవకాశం వస్తే కోత పూర్ణచంద్రరావు భార్య కోత అరుణకుమారి పేరును పరిశీలించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆమె గతంలో చిన్నబడాం నుంచి కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. కౌన్సిలర్‌గా పని చేసిన హయములో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు. దీంతో కూటమి అభ్యర్థిత్వంలో సామాజిక, రాజకీయ సమీకరణాలతో పాటు రిజర్వేషన్ అంశం కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. కోత పూర్ణచంద్రరావు అభ్యర్థిత్వం ఖరారైతే ఆయన ముందున్న ప్రధాన సవాల్ కూటమి పార్టీల మధ్య సమన్వయమే. టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి తమకు అనుకూల ఓట్లను ఉమ్మడి అభ్యర్థికి బదిలీ చేయగలరా? అన్నదే ఎన్నికల ఫలితాల్లో కీలక అంశంగా మారనుంది. టికెట్ల కేటాయింపులో అసంతృప్తులు, స్థానిక నాయకుల మధ్య విభేదాలు, వర్గపోరు, సమన్వయ లోపం, రెబల్ అభ్యర్థుల రంగప్రవేశం వంటి అంశాలు కూటమి విజయావకాశాలను ప్రభావితం చేసే అవకాశముంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో వార్డు స్థాయి రాజకీయాలు అత్యంత కీలకంగా ఉండటంతో.. ఒక్కో వార్డులో ఏర్పడే చిన్నపాటి చీలిక కూడా చైర్మన్ అభ్యర్థి విజయంపై ప్రభావం చూపే పరిస్థితి ఉంటుంది.

## 36 వార్డుల్లో 'గెలుపు గుర్రాలు' ఎవరు?

చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయడం ఒక ఎత్తయితే.. 36 వార్డుల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించడం మరో ఎత్తుగా మారనుంది. ప్రతి వార్డులో సామాజిక, రాజకీయ, వ్యక్తిగత సమీకరణాలు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంది. ప్రజాదరణ ఉన్నవారితో పాటు పార్టీకి విధేయులైన నాయకులు, స్థానికంగా బలమైన వ్యక్తులు, ప్రత్యర్థులను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్నవారిని గుర్తించి టికెట్లు కేటాయించడం కూటమికి కీలకంగా మారనుంది. టికెట్ ఆశించి భంగపడిన నాయకులు రెబల్స్‌గా బరిలోకి దిగితే..



వారి ప్రభావం కేవలం వార్డు ఫలితానికే పరిమితం కాకుండా చైర్మన్ అభ్యర్థి ఓట్లపై కూడా పడే అవకాశం ఉంది. అందువల్ల చైర్మన్ అభ్యర్థి బలంతో పాటు 36 వార్డుల్లో కూటమి నిలబెట్టే అభ్యర్థుల సామర్థ్యమే అసలు విజయ సమీకరణంగా మారనుంది.ప్రత్యర్థుల వ్యూహాలపై ఉత్కంఠకూటమి తరపున కోత పూర్ణచంద్రరావు పేరు ఖరారైతే ప్రత్యర్థి రాజకీయ పక్షాలు కూడా తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం, వ్యక్తిగత పరిచయాలు, స్థానిక ప్రభావాన్ని ఎదుర్కొనే విధంగా ప్రత్యర్థులు కూడా బలమైన అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. ఇప్పటికే వివిధ పార్టీల్లో చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చే కొద్దీ పలాస మున్సిపల్ రాజకీయాల్లో మరిన్ని పేర్లు తెరపైకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఓట్ల సమీకరణమే తుది లెక్కమొత్తంగా చూస్తే.. కోత పూర్ణచంద్రరావు పేరు కూటమి చైర్మన్ అభ్యర్థిగా ఖరారైతే జనసేనకు పలాస మున్సిపల్ పీఠంపై కొత్త ఆశలు చిగురించే అవకాశం ఉంది. అయితే మాజీ చైర్మన్‌గా ఉన్న అనుభవం, వ్యక్తిగత పరిచయాలు మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని జనసేన పార్టీ నుంచి మొదటగా శ్రీకాకుళంలో జిల్లా పలాస పట్టణంలో బాగా వేసేందుకు అవకాశం ఎక్కువగా ఉన్నాయని రాజకీయ పండితులు అంటున్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఓట్ల బదిలీ, 36 వార్డుల్లో బలమైన అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపులో అసంతృప్తుల నియంత్రణ, రెబల్ అభ్యర్థులను నిలువరించడం, స్థానిక వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం వంటి అంశాలే కీలకంగా మారనున్నాయి.చివరికి చైర్మన్ పీఠంపై ఎవరు కూర్చుంటారన్నది నేతల అంచనాలు, తెరవెనుక చర్చలు నిర్ణయించవు. 36 వార్డుల్లో ఓటరు వేసే ఓటే తుది తీర్పు. కోత పేరు చుట్టూ సాగుతున్న చర్చ జనసేనకు కొత్త బలం ఇస్తుందా? లేక కూటమి అంతర్గత సమీకరణాలే దానికి పరీక్షగా మారతాయా? అన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

### పుట్టుకతో బాధ..

# పింఛను కోసం తప్పని వ్యధ!



సోంపేట, సెప్టెంబర్ 13 (వార్త): పుట్టుకతో వచ్చిన వ్యాధి ఆ పాపకు శాపంగా మారింది. శారీరక ఎదుగుదల లేక దివ్యాంగు రాలిగా జీవితం గడుపుతోంది. తల్లిదండ్రులకు ఎనలేని బాధ మిగుల్చుతోంది. ఇటువంటి దివ్యాంగురాలికి పింఛను అందాల్సి ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్ మంజూరు కాక ఇప్పటివరకు పింఛనుకు నోచుకోలేదు. ఇటీవల సదరం సర్టిఫికెట్ అప్రూవల్ జరిగినా ఇంకా మంజూరు కాలేదు. ప్రభుత్వం కొత్త పింఛన్లకు ఈ నెల 16 వరకు మాత్రమే గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈలోగా సర్టిఫికెట్ వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో పింఛన్ అవకాశం ఇప్పుడు కూడా కోల్పోవచ్చని ఆ కుటుంబం ఎంతో ఆందోళన చెందుతుంది. సోంపేట మండలం బారువ పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన ఈ కుటుంబాన్ని ఇచ్చాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ఆదివారం పరామర్శించి పూర్తి వివరాలను ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ పుట్టుకతో డ్వారఫిమ్ అనే వ్యాధితో బాధపడుతున్న ఈ బాలికకు ఒకసారి సదరం సర్టిఫికెట్ మంజూరు అయితే ఆటోమేటిక్‌గా పెన్షన్ అప్లికేషన్ ప్రాసెస్ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం డయాలసిస్ రోగులకు ఇదే విధానం ప్రభుత్వం అవలంబిస్తుందని గుర్తు చేశారు. ఇటువంటి దివ్యాంగురాలికి పింఛన్ రావడానికి మళ్లీ ఎన్నేళ్లు పడుతుందో తెలియని పరిస్థితి అని శ్యాం ప్రసాద్ వాపోయారు.

## 19 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం పంపిణీ



ఆమదాలవలస, సెప్టెంబర్ 13 (వార్త): ఆమదాలవలస మండలం, మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం, చికిత్స పొందుతూ చనిపోయిన వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల అందజేశారు. ఆదివారం బాధితుల ఇళ్లకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సీఎం చంద్రబాబు కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారని కూన ప్రమీలా తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్న దూగంలో ఉచిత వైద్య శిబిరం



జలుమూరు, సెప్టెంబర్13 (వార్త): జలుమూరు మండలం చిన్న దూగాం గ్రామంలో ఆదివారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ గొలివి సుజాత వైద్య సేవలను అందించారు. ఈ ందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా డయేరియా, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల వృద్ధికి అవకాశం లేకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. తాగునీటి విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంట్లో నీటిని వేడి చేసి చల్లార్చిన అనంతరం తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు దోమతెరలను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని బావుల్లో నీటి నాణ్యతను మెరుగుపరిచేందుకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామస్థులకు ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ వ్యాధుల నివారణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజాతతో పాటు వైద్య సిబ్బంది చిన్న రాజులు, సత్యవతి, శ్రీనివాసరావు, జగదాంబ, శుభ పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

జలుమూరు, సెప్టెంబర్ 13 (వార్త): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు ఐక్యతతో, సంయమనంతో మెలగాలని జలుమూరు ఎస్ఐ పి.అశోక్‌బాబు సూచించారు. శనివారం రాత్రి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు సమష్టిగా చర్చించుకుని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఎస్ఐ సూచించారు. ఎన్నికల సమయంలో చిన్నపాటి వివాదాలు కూడా పెద్ద సమస్యలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించాలని కోరారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలతో పోలీసులు మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్ఐ పి.అశోక్‌బాబు పేర్కొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మట్టి గణపతిని పూజిద్దాం

* రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన * ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**నరసన్నపేట, సెప్టెంబర్13 (వార్త):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశాల మేరకు 'పీఓపీ వద్దు.. మట్టి గణపతి ముద్దు' అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరం వద్దకు వచ్చిన మహిళలు, యువత, భక్తులకు బగ్గు అర్చనతో పాటు కూటమి టీడీపీ నాయకులు మట్టి వినాయక ప్రతిమలు, పూజా పుస్తకాలను అందజేశారు. మొత్తం 1000కుపైగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించని సహజ మట్టి విగ్రహాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. పీఓపీ, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్ఠించేందుకు ముందుకు రావాలని కోరారు. పూర్వం నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను కొనసాగిస్తూనే ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె సూచించారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, రాష్ట్ర పొందర కూరకుల కమిటీ చైర్మన్ దామోదర్ నరసింహులు, జిల్లా కార్యదర్శి బలగ భారతి, మండల పార్టీ అధ్యక్షుడు అడప చంద్రశేఖర్, క్లస్టర్ గొద్దు చిట్టిబాబు, సీనియర్ నాయకులు ఊర్ణ వెంకటేశ్వరరావు, సాసుపల్లి కృష్ణాబాబు, కింజరాపు రామారావు, నేతింటి విశ్వేశ్వరరావు, బలగ ప్రహర్ష, రావాడ గణపతి, బోయిన నర్సింహామూర్తి తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.







## ఎమ్మెల్యే గౌతు శిరీషకు పర్యావరణహిత గణపతి ప్రతిమ అందజేత

**పలాస, సెప్టెంబర్ 13 (వార్త):** రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో తయారు చేసిన పర్యావరణహిత (ఈకో ఫ్రెండ్లీ) గణపతి ప్రతిమను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆదివారం అందజేశారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన ప్రతిమను చూసిన ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా శ్రీ సత్యసాయి విద్యావిహార్ యాజమాన్యం, ఉపాధ్యాయులు చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా వినాయక ప్రతిమలను తయారు చేసి పూజించడం ద్వారా భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యక్షుడు తాలాసు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అనుదీప్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావుకు సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు పర్యావరణహిత గణపతి ప్రతిమను అందజేశారు.

## అమర్ సోలార్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ



**కొత్తూరు, సెప్టెంబర్13 (వార్త):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కొత్తూరు మండల కేంద్రంలో అమర్ సోలార్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమర్ సోలార్ నిర్వాహకులు పెద్దిన అమర్, పెద్దిన ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు (తాతబాబు), లోతుగెడ్డ భగవాన్ నాయుడు, లోతుగెడ్డ ఇందిరరామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. భక్తిశ్రద్ధలతో పండుగను చేసుకుందామన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలన్నారు. మట్టి వినాయకుల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరగడంతో పాటు చెరువులు, నదులు, ఇతర నీటి వనరులు కాలుష్యం బారిన పడకుండా కాపాడవచ్చని తెలిపారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ హితమైన విధానాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం.. మన పర్యావరణాన్ని కాపాడుకుందాం అని లోతుగెడ్డ సోదరులు ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన అమర్ సోలార్ నిర్వాహకులు పెద్దిన అమర్, పెద్దిన ప్రశాంత్‌లను ఈ సందర్భంగా ముఖ్య అతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు చిన్నరాజు, బోర శ్రీరాములు, కోయిలాపు శ్రీనివాసరావు, పడాల వెంకటకృష్ణ, కలమట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## భక్తికి, సేవకు.. గణేష్ ఉత్సవాలు వేదిక

**పలాస, సెప్టెంబర్13 (వార్త):** విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు సామాజిక సేవా స్ఫూర్తిని చాటాలన్న లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాశీబుగ్గ ఆధ్వర్యంలో ఉచితంగా గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కేవీ రామకృష్ణ, టి.శ్రీనివాసరావు, కొంచాడ వెంకట రామకృష్ణ, తూముల శ్రీనివాసరావు మాట్లాడుతూ గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతి ఇల్లు, ప్రతి వీధిలో విఘ్నేశ్వరుడి నామస్మరణ మార్మోగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా గణపతి విగ్రహాల కొనుగోలుతో భక్తులపై పడే ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడంతో పాటు సేవాభావాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో ఉచిత విగ్రహాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను సామాజిక సేవతో అనుసంధానించడం ద్వారా సమాజానికి మరింత మేలు చేకూరుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ గణేష్ ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరారు. పర్యావరణహిత గణపతి విగ్రహాలను వినియోగించాలని, రసాయన రంగులు, కాలుష్యానికి కారణమయ్యే పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## కాకినాడ ఆదిత్య ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 13 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జనసేన శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు, మన సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, జనసేన జిల్లా నాయకులు గొర్లె జగన్నాధం, రౌతు నారాయణరావు కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.





## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**జి.సిగడాం, సెప్టెంబర్ 13 (వార్త):** పర్యావరణ హితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని మండల బీజేపీ నాయకులు పైల విష్ణుమూర్తి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్లో ప్రజలకు ఉచితంగా మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు గాను 500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలన్నారు. పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం వల్ల నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు జలచరాల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు, రసాయన రంగులను వినియోగించకుండా సహజ సిద్ధమైన విగ్రహాలనే ఉపయోగించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు భూపతి అర్జున్ కుమార్, నాయకులు వజ్జ పర్తి రఘురాం, ముద్దాడ గౌరీ పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో 1000 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**సోంపేట, సెప్టెంబర్ 13 (వార్త):** పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో సోంపేట పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. సోంపేట మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బీన ప్రదీప్, బొమ్మిడి తేజ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన ఇంచార్జి దాసరి రాజు ముఖ్య అతిథిగా పాల్గొని 1000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సోంపేట పట్టణంలోని ప్రయాణికులు, బాటసారులు, గ్రామ ప్రజలు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలకు విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోంపేట టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిత్రాడ శేఖర్, కోదండరామ ఆలయ చైర్మన్ బీన ఆనంద్, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు,బెల్లానా శ్రీకాంత్, సానా షణ్ముఖరావు, రెల్ల నారాయణ, రెల్ల శ్రీనివాసరావు, జనసైనికులు దూగాన సురేష్ కుమార్, గుజ్జుల శంకర్ రావు, హేమారావు, దేవాడ రవికుమార్ తో పాటుగా పెద్ద సంఖ్యలో జనసైనికులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546